క్లుప్తంగా

జై చిరంజీవ..జగదేకవీర..



శ్రీకాకుళం కల్చరల్: చిన్న బొందిలీపురంలోని మారుతీ దర్బార్‌లో సంజీవని అంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు.

తోటపాలెంలో గ్రామదేవత పండగ

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెంలో మంగళవారం గ్రామదేవత పండగ ఘనంగా నిర్వహించారు. అసిరితల్లి, నీలమ్మ తల్లికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం విందు భోజనాలు కావడంతో జనాలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశమున్నందున ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టిపెట్టారు.

మజ్జిగ వితరణ



మజ్జిగ పంపిణీ చేస్తున్న యువకులు

జి.సిగడాం: రాజాం–శ్రీకాకుళం రహదారిలో పైడితల్లి అమ్మవారి యాత్రకు వెళ్లిన భక్తులకు మంగళవారం దవళపేట శ్రీరామలింగేశ్వర స్వామి యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మురళీ, చందు, సువ్వారి శ్యామ్, సాయి, చందు, పవన్, తరణ్, హేమరాజు, కేశవ పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: తమ భూమి ఆక్రమణకు గురైందంటూ శ్రీకాకుళం రూరల్ మండలం పెదపాడు పంచాయతీ తంగివానిపేట ఎస్సీ కాలనీ లోపింటి అప్పమ్మ, సవలాపురపు అప్పన్న, ఎచ్చెర్ల తవిటమ్మ, పుట్టా ఇందుమతి సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. లోపింటి రామయ్య పేరిట ఉన్న డీ పట్టాను మంజూరు చేశారని, అయితే ఆ భూమిని ఎర్రగడ్డ గీత శ్రీకాంత్, మరికొందరు ఆక్రమించుకున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలోనూ కొంతమంది వ్యక్తులు, ఎర్రగడ్డ గీత శ్రీకాంత్ కలిసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తే అడ్డుకున్నామని, శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

తప్పుడు హాజరు నమోదుచేస్తే చర్యలు



మస్టర్ షీట్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ మల్లేశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో మస్టర్ షీట్లు సక్రమంగా ఉండాలని ఎచ్చెర్ల ఇన్‌చార్జి ఎంపీడీవో బి.మల్లేశ్వరరావు అన్నారు. సంతసీతారాంపురంలో ఉపాధి మస్టర్ షీట్లు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పుడు హాజరు నమోదుచేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గరిష్ఠ వేతనం వచ్చేలా ఉదయం, మధ్యాహ్నం కనీసం ఎనిమిది గంటలు పనిచేయాలన్నారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశం వద్ద తాగునీరు, టెంట్లు వంటివి అందుబాటులో ఉంచాలని సూచించారు.

వ్యాధులపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న సర్పంచ్ సోనియా

జి.సిగడాం: వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెంట గ్రామ సర్పంచ్ పున్నాన సోనియా అన్నారు. మంగళవారం సచివాలయ ఆవరణలో జిల్లా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పున్నాన అక్కలనాయుడు, మక్క నారాయణ రావు, మీసాల రమణ, ఎండువ ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు?

- కూటమి ప్రభుత్వంలో ఉన్నత విద్య నిర్వీర్యం
- పేరుకుపోతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు
- వేలాది మంది విద్యార్థుల ఎదురుచూపు
- కళాశాల యాజమాన్యాలకు తప్పని ఇక్కట్లు
- నేడు వైఎస్సార్ సీపీ యువత పోరు



ఇంజినీరింగ్ విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఉన్నత విద్య నిర్వీర్యమవుతోంది. కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు అందజేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోపక్క ఫీజు చెల్లించకున్నా కళాశాలలు విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సర్కారు హెచ్చరికలు జారీ చేస్తుండటంతో యాజమాన్యాలు బకాయిలు కోసం నిరీక్షిస్తున్నాయి. అదే సమయంలో ప్రైవేట్ విద్యా సంస్థలు అధ్యాపకులకు వేతనాలు సైతం చెల్లించలేని పరిస్థితులు కొనసాగుతున్నాయి. కొన్ని విద్యా సంస్థల్లో అధ్యాపకులకు నెలల వేతనం బకాయిలు ఇవ్వాల్సి ఉందని సమాచారం.

ఉన్నత కళాశాలలకు కేరాఫ్ అడ్రస్‌గా..

ఎచ్చెర్ల నియోజకవర్గం ఉన్నత విద్యా సంస్థలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఎచ్చెర్లలో శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, చిలకపాలెంలో శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సంత సీతారాంపురంలోని సైక్ వ్యవసాయ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ, రణస్థలంలో రెండు డిగ్రీ కళాశాలలు ఇలా చాలా విద్యా సంస్థలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కొనసాగుతున్నాయి. నియోజక వర్గంలో 13వేల మంది వరకు విద్యార్థులు ఉన్నత విద్య చదువుతున్నారు. ఈ విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకుంది. ఫీజుల కోసం ఎదురు చేస్తున్నారు. గతంలో విద్యా దీవెన, వసతి దీవెన అకడమిక్ ఇయర్ ముగిసే సరికి విద్యార్థుల తల్లిదండ్రులు ఖాతాల్లో డబ్బులు చేరేవి. దీంతో కళాశాలలకు ఫీజులు చెల్లించేవారు. ప్రస్తుతం సకాలంలో ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ అందజేయకపోవటం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

విద్యార్థుల తరఫున పోరాటం



విద్యార్థులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుంది. సకాలంలో విద్యా సంస్థలకు ఫీజు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఫీజులు విడుదల చేసే వరకు విద్యార్థుల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుంది.

– బోర సాయిరాంరెడ్డి, ఎచ్చెర్ల మండల పార్టీ కన్వీనర్

తరలిరండి



వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టరేట్ వద్ద బుధవారం యువత పోరు నిర్వహిస్తున్నాం. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి విద్యార్థులు, యువకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలి.

– గొర్లె కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, ఎచ్చెర్ల

ఫీజుపోరు విజయవంతం చేయాలి



యువత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు బుధవారం నిర్వహించనున్న యువత పోరును విజయవంతం చేయాలని ఎచ్చెర్ల మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరాం పిలుపునిచ్చారు. మంగళవారం ఎచ్చెర్ల, చిలకపాలెం, సంతసీతారాంపురం గ్రామాల పరిధిలోని పలు విద్యా సంస్థలను సందర్శించారు. కళాశాల యాజమాన్యాలతో మాట్లాడారు. అనంతరం ఫీజుపోరు పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దుంప చిన్నారెడ్డి, డొంక వెంకటరమణ, బోర గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ కొనసాగేనా?

- ఏడాది పూర్తయిన సుజాత పదవీ కాలం
- కొనసాగించాలంటే చట్టబద్ధత తప్పనిసరి!

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా పి.సుజాత బాధ్యతలు స్వీకరించి మంగళవారం నాటికి ఏడాది పూర్తయ్యింది. గత ఏడాది మార్చి 11న ఆమె బాధ్యతలు స్వీకరించారు. వాస్తవానికి, ఉన్నత విద్యాశాఖ అనుమతిలో వైస్ చాన్సలర్ రిజిస్ట్రార్‌ను నియస్తారు. ఏడాది పూర్తయ్యాక కూడా మరో సంవత్సరం ఉన్నత విద్యా శాఖ అనుమతులతో కొనసాగించవచ్చు. ఇలా ఆరేళ్ల వరకు పెంచుతూ వెళ్లవచ్చు. ప్రస్తుతం రిజిస్ట్రార్ నియామకానికి పాలక మండలి అనుమతి లేదు. నియమించిన ఆరు నెలల లోపు చట్టబద్ధత కల్పించాల్సి ఉంటుంది. పాలక మండలి సమావేశంలో ర్యాటిఫికేషన్ చేయాల్సి ఉంది. అయితే విశ్వ విద్యాలయంలో ఏడాదిగా ఎటువంటి పాలక మండలి సమావేశం జరగలేదు. ఫలితంగా రిజిస్ట్రార్ నియామకానికి చట్టబద్ధత కల్పించలేదు. కూటమి ప్రభుత్వ సహకారం సైతం వీసీకి లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత రిజిస్ట్రార్‌ను కొనసాగిస్తే సాంకేతిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ఇన్‌చార్జి రిజిస్ట్రార్ నియమించే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీలో ప్రస్తుతం ఇద్దరు ప్రొఫెసర్లు మాత్రమే ఉన్నారు. వీరిలో రిజిస్ట్రార్ ఒకరు, రెక్టార్ హోదాలో మరొకరు ఉన్నారు. రెగ్యులర్ రిజిస్ట్రార్ నియామకానికి ప్రొఫెసర్ అర్హత తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

తామాడలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల : లావేరు మండలం తామాడలో మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను తీయించి ట్రాక్టర్లతో డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. బావులు, బోర్లు వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు.

మనోవికాస కేంద్రం సందర్శన



కేంద్రం నిర్వాహకులను సత్కరిస్తున్న పూర్ణచంద్ర సాహూ తదితరులు

శ్రీకాకుళం: నగర పరిధిలోని బెహరా మనోవికాస కేంద్రాన్ని భారతీయ హ్యూమన్ రైట్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు పూర్ణచంద్ర సాహూ మంగళవారం సందర్శించారు. బీహెచ్ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కేంద్రం నిర్వాహకులు శ్యామలతో మాట్లాడారు. ఇక్కడ అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. హ్యూమన్ రైట్స్ సంస్థ తరఫున ఎటువంటి సహకారం కావాలన్నా అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రా రీజనల్ హెడ్ కొంక్యాన వేణుగోపాల్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని వరం వీధిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటా నిర్వహించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు సంతోష్‌కుమార్, అప్పన్న, రాంబాబు, సుధాకర్, లావణ్య, రమ్య పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కారమే లక్ష్యం

జి.సిగడాం: గ్రామాల్లో భూ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని మండల పరిషత్ ప్రత్యేకాధికారి రాజేంద్రప్రసాద్‌బాబు అన్నారు. మంగళవారం జి.సిగడాం రెవెన్యూ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు, ధ్రువ పత్రాల మంజూరులో జాప్యం రాకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జి.రామకృష్ణారావు, ఏఓ వై.శారద, ఏఈఈలు పైడి దుర్గాప్రసాద్, సత్యనారాయణ, యువరాజ్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ముమ్మరంగా శ్మశానవాటిక పనులు



పనులు నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని మెట్టవలసలో శ్మశాన వాటిక అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చెత్తాచెదారాలు, తుప్పలు పేరుకుపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నందున సర్పంచ్ కామొజుల ఆరుద్ర, ఎంపీటీసీ సభ్యురాలు బెవర విజయలక్ష్మి పర్యవేక్షణలో పనులు చేయిస్తున్నామని నాయకులు కామొజుల సీతారాం, బెవర జగన్నాథం తెలిపారు.

పిల్లలపై శ్రద్ధ అవసరం



వైద్యుడిని సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని క్రాంతి విద్యానికేతన్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ గుండ అమ్మడు అన్నారు. సింగుపురంలో క్రాంతి విద్యానికేతన్‌లో మంగళవారం తల్లిదండ్రుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీ మాయలో పడి పిల్లలను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్, వైద్యులు మాకేన సతీష్, సర్పంచ్ గుండ ఆదిత్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటుతున్న అరటి

- శుభకార్యాల సీజన్ కావడంతో పెరిగిన గిరాకీ
- ఒక్కో గెల రూ.300 నుంచి రూ.500 పలుకుతున్న ధరలు



అమ్మకానికి తెచ్చిన అరటి గెలలు

ఎచ్చెర్ల :

వివాహాది శుభకార్యాలు, యాత్రలు ప్రారంభం కావడంతో అరటి పండ్ల ధరలు అమాంతం పెరిగాయి. గెల కొనాలంటే చుక్కలు చూడాల్సిన పరిస్థితి. అయితే అరటిని పండించే రైతు కంటే వాటిని తోటల్లో కొనుగోలు చేసి, మార్కెట్లుకు తరలించే దళారీలకే అధిక మొత్తంలో లాభాలు దక్కుతున్నాయి. ప్రధానంగా వివాహ శుభ కార్యక్రమాల్లో అరటి పండ్లను పెట్టడం ఆనవాయితీ కావడంతో వీటికి డిమాండ్ పెరిగింది.

సంతల్లో డిమాండ్..

బుడుమూరులో ప్రతి సోమవారం జరిగే వారపు సంతకు ముందు రోజే రణస్థలం, లావేరు, జి.సిగడాం, పొందూరు, ఎచ్చెర్ల తదితర ప్రాంతాల నుంచి అరటి గెలలు వస్తుంటాయి. వెంటనే దళారీలు, కొనుగోలుదారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో డజన్ అరటిపండ్ల ధర రూ.30 నుంచి రూ.40 పలుకుతోంది. 10 నుంచి 12 డజన్లు ఉండే అరటి గెల ధర రూ.350 పలుకుతుంది. పెళ్లిళ్లు, సంబరాలు చేసే వారంతా నాలుగు రోజుల ముందుగానే ఈ అరటి గెలలు కొనుగోలు చేసి తమ ఇళ్లకు తీసుకెళ్తున్నారు.

సాధారణ రకమే..

ప్రస్తుతం మార్కెట్‌లో సాధారణ రకం అరటిపండ్లు మాత్రమే లభిస్తున్నాయి. ఎచ్చెర్ల నియోజకవర్గం ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల్లో రైతులు పండిస్తున్న కర్పూర, పవన్ జాతికి చెందిన రకాలు విక్రయిస్తున్నారు. ఇవి చాలా చిన్న పరిమాణంలో ఉంటున్నాయి. ఇందులో నాణ్యత ఉన్న గెలలకు మంచి ధర లభిస్తుంది. అమృతపాణి, చక్కెర కేళి గెల రూ.400 దాటి పలుకుతోంది. గతంలో సాధారణ రకం అరటి పండ్లకు పెద్దగా డిమాండ్ ఉండేది కాదు. రూ.250 పెడితే అరటిగెల లభించేది. ఇప్పుడు ధరలు అమాంతం పెరిగాయి.

మంచి డిమాండ్..

ప్రస్తుతం అరటి గెలలు రేట్లు పెరగడంతో వినియోగించాలంటేనే భయం వేస్తుంది. శుభకార్యాలకు తప్పనిసరిగా కొనాల్సి వస్తోంది. మా ఇంట్లో శుభకార్యానికి 20 అరటి గెలలను రూ.7 వేలకు కొన్నాం.

– జి.రామినాయుడు, మురపాక, లావేరు మండలం

నాణ్యత బట్టి ధరలు

మార్కెట్లో అరటిపండ్ల ధరలకు మంచి గిరాకీ ఉంది. ఒక్కో గెల నాణ్యతను బట్టి గతంలో ఉన్న ధర కంటే రూ.100 వరకూ పెరిగాయి. అమృతపాణి రకం పండ్లు లభించడం కష్టంగా ఉంది.

– వి.రామినాయుడు అరటిపండ్ల వ్యాపారి, లావేరు

చిత్రం..భళారే విచిత్రం



పొన్నాడ పంచాయతీ ముద్దాడపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. స్థానిక స్మార్ట్ కెం పరిశ్రమ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అనే అంశంపై చిన్నారులు గీచిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం విజయమ్మ పర్యవేక్షించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

కరుణించమ్మా.. భద్రమ్మ..



బలగ బుచ్చిపేటలో భద్రమ్మ తల్లికి మంగళవారం మహిళలు ముర్రాట్లు సమర్పించారు. బలగలో రామాలయం పూర్తయిన సందర్భంగా మేళతాళాలతో వెళ్లి చల్లదనం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ప్రతిష్టాపనోత్సవానికి వేళాయె..



బలగలో రామాలయ పునర్నిర్మాణ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈ నెల 12 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా రామాలయాన్ని విద్యుత్ లైట్లతో సుందరంగా అలంకరించినట్లు చెప్పారు. మూడు రోజుల పాటు శోభాయాత్ర, అఖండ దీపారాధనలు, సూర్యనమస్కారాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, హోమాలు, స్థిర యంత్ర ప్రతిష్ఠ మహోత్సవం, సీతారాములు కల్యాణం నిర్వహిస్తామని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

– శ్రీకాకుళం కల్చరల్